తలరాతను మార్చే భవిత

- దివ్యాంగ చిన్నారులకు ఆసరా
- భవిత కేంద్రాల్లో అందుతున్న సహిత విద్య
- చిన్నారుల్లో పెంపొందుతున్న ఆత్మ విశ్వాసం



పిల్లలకు ఆటలపాటలతో పాటు విద్యను నేర్పుతున్న టీచర్

గుడిపాల: దివ్యాంగ చిన్నారులకు భవిత కేంద్రాలు ఆసరాగా నిలుస్తున్నాయి. వారి తలరాతను మార్చే ఉజ్వల భవితను అందించేలా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయి. అవయవాల లోపం, బుద్ధిమాంద్యం వంటి వైకల్యంతో పోరాడుతున్న చిన్నారుల పురోగాభివృద్ధికి భవిత కేంద్రాలు తోడ్పాటునందిస్తున్నాయి. సాధారణంగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు ఇంటికే పరిమితం అయ్యేవారు. దీంతో వీరిని చూసుకోవడం తల్లిదండ్రులకు ఎంతో కష్టంగా ఉండేది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాలు భవిత కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల్లో నూతన ఉత్సాహం నింపి వారి మనో వికాసానికి బాటలు వేసే విధంగా ప్రణాళికలు సిద్ధం రూపొందించి అమలు చేశారు. దీంతో గతంలో వారి వ్యక్తిగత పనులను కూడా చేసుకోలేని పిల్లలు సైతం వారి అవసరాలను వారు సొంతంగా చేసుకొనే స్థితికి వచ్చారు.

సహిత విద్య

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అందజేసే సహిత విద్యను విద్యాశాఖలో భాగమైన సమగ్రశిక్షా పథకం ద్వారా భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నారు. భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 3:30 గంటల వరకు సంరక్షించి వారికి 21 రకాల సేవలతో కూడిన సహిత విద్యను అందిస్తున్నారు. వీరికి మధ్యాహ్నభోజన పథకంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తున్నారు. అందుకు అవసరమైన ఆట పాటలతో ఉత్తేజపరచి వారిని ప్రోత్సహిస్తున్నారు.

ప్రత్యేక ఫిజియోథెరపీ

మండల కేంద్రంలో నరహరిపేట జెడ్పీ హైస్కూల్ ఆవరణలోని భవిత కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాల చిన్నారులను ప్రోత్సహించి వారిలో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నారు. ఈ కేంద్రంలో ప్రతి బుధవారం ప్రత్యేక ఫిజియోథెరపీ శిక్షణా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అందించాల్సిన ఫిజియోథెరపీపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో వారిలో శరీర వైకల్యాన్ని తగ్గించేందుకు తేలికపాటి యోగాసనాలు, వ్యాయామాలను తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు. మంచానికే పరిమితమైన వారిని వారంలో రెండు రోజులు గృహ సందర్శన చేసి సహిత ఉపాధ్యాయుల ద్వారా వారికి అవసరమైన ఫిజియోథెరపీ సేవలను అందిస్తున్నారు.



ఫిజియోథెరపీ చేస్తున్న శిక్షకులు

గత ప్రభుత్వ హయాంలో...

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం భవిత కేంద్రాలకు అవసరమైన ప్రత్యేక పరికరాలను అందజేయడంతో పాటు వినికిడి, ఇతర శరీర అవయవ లోపాలు కలిగిన చిన్నారులను గుర్తించింది. సమగ్ర శిక్షా ద్వారా వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లను, హియరింగ్ మిషన్లు వంటి వివిధ రకాల పరికరాలను అందజేసింది. కూటమి ప్రభుత్వం కూడా దివ్యాంగ చిన్నారులను గుర్తించి వారికి అవసరమయ్యే పరికరాలను అందజేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మార్పు కనబడుతోంది



మా బాబు వేదాంత్ బుద్ధిమాంద్యంతో జన్మించాడు. చిన్నప్పుడు ఏ విషయం కూడా మాకు చెప్పేవాడు కాదు. బాబు పరిస్థితి చూసి చాలా ఆందోళనగా ఉండేది. భవిత కేంద్రంలో చేర్పించడం నిత్యం ఫిజియో థెరపిస్ట్ సూచనల మేరకు అవసరమైన శిక్షణను అందజేస్తున్నాం. దీంతో వాడిలో మార్పు కనబడుతోంది.

సరస్వతి, బండపల్లె, గుడిపాల

గతం కంటే మెరుగ్గా ఉంది



మా బాబు సతీష్ పుట్టుకతోనే సరిగ్గా నడవక బలహీనంగా ఉండేవాడు. వాడికి ప్రతి పనిలో ఎవరో ఒకరు తోడు ఉండాల్సి ఉండేది. ఏ విషయం కూడా మాకు చెప్పలేక ఇబ్బంది పడేవాడు. భవిత కేంద్రానికి తీసుకురావడంతో కొన్ని విషయాలను మాకు తెలియజేసేందుకు ప్రయత్నిస్తుండడం కాస్త ఊరటగా ఉంది.

రాముడు, అనుపు, గుడిపాల

తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి



దివ్యాంగ చిన్నారులపై వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వారిని క్రమం తప్పకుండా భవిత కేంద్రానికి పంపించినప్పుడే వారిలో మానసి ఉత్సాహం కలిగి పురోభివృద్ధి సాధించగలుగుతారు. రోజూ వారికి శారీరక శిక్షణను కూడా మా సూచనల మేరకు అందజేయాలి. అప్పుడే వారిలో మార్పుని తీసుకురాగలం.

వాణి, ఐఈఆర్‌టీ టీచర్, గుడిపాల.

2న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో బీజెడ్ పాఠశాల పూర్వ విద్యార్థుల కార్యక్రమం ఫిబ్రవరి 2న నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్లు దొరస్వామి, శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. నగరంలోని చర్చివీధిలోని బీజెడ్ ఉన్నత పాఠశాలలో 1974–75లో పదో తరగతి చదివిన విద్యార్థులు సమావేశం కానున్నట్లు తెలిపారు. గోల్డెన్ జూబ్లీని పురస్కరించుకుని ఫిబ్రవరి 2న హోటల్ ది బాన్స్‌లో రీ యూనియన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులు ఇతర వివరాలకు 9490181994ను సంప్రదించాలని వారు కోరారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నూతన క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యార్థుల పెంపునకు చర్యలు చేపట్టాలన్నారు. బడి బయటి పిల్లలను బడిలో చేర్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినాయకం, రాష్ట్ర ఉపాధ్యక్షులు సులోచన, జిల్లా అధ్యక్షులు మురళి, ప్రధాన కార్యదర్శి భాస్కర్, సభ్యులు మహేష్, పొన్నయ్య పాల్గొన్నారు.

నెలాఖరులోపు పనులు పూర్తి చేయండి



గోకులం షెడ్లను పరిశీలిస్తున్న ఏపీడీ సుబ్రమణ్యం

గుడిపాల: మండలానికి మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణాలను ఈ నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలని ఉపాధి హామీ ఏపీడీ సుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని పాపసముద్రం, వసంతాపురం, కేజే పురం గ్రామాల్లో శుక్రవారం జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మొదట విడతలో 55 గోకులం షెడ్లు గుడిపాలకు మంజూరయ్యాయని ఇందులో 23 పూర్తికాగా మిగతావి పలుదశల్లో ఉన్నాయని చెప్పారు. రైతులందరికీ ఈ నెలాఖరు కల్లా పూర్తి చేయాలని తెలియజేశామన్నారు. పనులు నాణ్యతగా సకాలంలో పూర్తిచేస్తే బిల్లులు కూడా త్వరగా అందుతాయని పేర్కొన్నారు. ఉపాధిహామీ పనులకు సంబంధించి ప్రతి కుటుంబం మార్చి 31వ తేదీలోపు వందరోజుల పని పూర్తిచేసుకోవాలని చెప్పారు. ఆయనతో పాటు టీఏలు సుందరయ్య, చంద్రప్రకాష్ పాల్గొన్నారు.

తాళంబేడులో ద్విచక్ర వాహనం చోరీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలంలోని తాళంబేడు గ్రామంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ ద్విచక్ర వాహనాన్ని అపహరించారు. వివరాలు ఇలా గ్రామానికి చెందిన లవకుమార్ ఇంటి ముందు రూ.2.50 లక్షలు విలువ చేసే పల్సర్ బైక్‌ను పార్కు చేశాడు. గురువారం ఉదయం చూస్తే బండి కనిపించలేదు. దీంతో బీఎన్‌ఆర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. శనివారం కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఉపాధి కూలి రూ.700 ఇవ్వాలని వినతి



డ్వామా పీడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఉపాధి కార్మికులకు రోజుకు రూ.700 కూలి ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా కార్యదర్శి రామమూర్తి కోరారు. ఈ మేరకు ఆ బీకేఎంయూ, సీపీఐ నాయకులు శుక్రవారం డ్వామా పీడీ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జాతీయ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ 200లో జాతీయ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం వచ్చినప్పటి నుంచి నిర్లక్ష్యం జరుగుతోందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామీణ ఉపాధి కూలీలకు తీవ్ర నష్టం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల అలసత్వంతో రాష్ట్రంలోని ఉపాధి హామీ కూలీలు తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడుకు వలసలు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి ఉద్దేశంతో ఏర్పాటైన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయడంలో టీడీపీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఇప్పటికైనా గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించి, రోజుకు రూ.700 కూలీ ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలపై రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలకు రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీకేఎంయూ నాయకులు కే రామమూర్తి, దేశమ్మ, ఏటీయూసీ నాయకులు గోపీనాథ్, దాసరి చంద్ర పాల్గొన్నారు.

11 మంది జూదరుల అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పేకాడుతున్న 11 మందిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ నెట్టి కంటయ్య తెలిపారు. కూటమి నేతల కనుసన్నల్లో జరుగుతున్న పేకాట స్థావరాలపై సాక్షి దినపత్రికలో ఈ నెల 21న పేకాటే బరి కోట్లే గురి అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు సీరియస్ అయ్యారు. అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడ జరిగినా ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. హైరోడ్డులోని ఓ సిమెంట్ దుకాణం సమీపంలో శుక్రవారం పేకాట జరుగుతున్నట్లు టూటౌన్ పోలీసులు దాడులు జరిపి 11 మందిని అరెస్ట్ చేశారు. నిందుతుల్లో కె కార్తీక్, కార్తీక్, ఆర్ భాస్కర్, జె ఉమాపతి, మునిరత్నం, శివ, హేమ ప్రసాద్, ముస్తఫా, రాజ్‌కుట్టి, చాంద్‌బాషా, ఆసిఫ్ ఉన్నారు. వీరి నుంచి రూ.40,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రహదారి భద్రత జీవితానికి రక్షణ



సీఎస్‌ఆర్ కళాశాల వద్ద రోడ్డు వారోత్సవాల్లో విద్యార్థులు, అధికారులు

గుడిపాల: రహదారి భద్రత జీవితానికి రక్షణ అని చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే, మోంటీకార్లో లిమిటెడ్ అసిస్టెంట్ మేనేజర్ ముఖేష్‌కుమార్ గుప్తా, సైట్ ఇన్‌చార్జ్ జోలేందర్ సింగ్ 36వ జాతీయ రోడ్డుభద్రతా వారోత్సవాల్లో భాగంగా గుడిపాల సీఎస్‌ఆర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డుభద్రత నియమ నిబంధనలు పాటించి వాహనాలను నడపాలన్నారు. వాహనాలను నడిపేటప్పుడు హెల్మెట్, సీట్‌బెల్ట్‌లను తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. జీవితానికి సంబంధించిన రోడ్డుభద్రత విద్య అన్నారు. విద్యార్థులందరూ రహదారి భద్రత నియమ నిబంధనల గురించి ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. వాహనాలను నడిపేటప్పుడు కుటుంబసభ్యులను గుర్తు పెట్టుకొని నడపాలన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ లోకేష్, ప్రిన్సిపల్ రామచంద్ర, అధ్యాపకులు అర్జున్ పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం



పిడుదుల నివారణ మందు స్ప్రేచేస్తున్న డాక్టర్ సాయిసుధ

గుడిపాల: లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ ప్రక్రియతో పాడి రైతులకు ప్రయోజనాలు ఉన్నాయని పశువైద్యాధికారి సాయిసుధ అన్నారు. మండలంలోని వెంగమాంబపురంలో శుక్రవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లింగనిర్ధారిత వీర్యం సూదులను ప్రభుత్వమే సరఫరా చేస్తుందని, ఈ వీర్యం వల్ల 90శాతం పేయదూడలే జన్మిస్తాయన్నారు. భవిష్యత్‌లో లింగనిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందన్నారు. అనంతరం పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి, పాడి పశువులతో పాటు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను తాపారు. సాధారణ పశువులకు కూడా చికిత్సలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

డ్వాక్రా మహిళలకు ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

తవణంపల్లె: ఓటర్ల దినోత్సవం సందర్భంగా రెవెన్యూ కార్యాలయం ఎదుట శుక్రవారం డ్వాక్రా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. తహసీల్దార్ సుధాకర్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు కార్యాలయం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు రంగుల రంగుల ముగ్గులను వేసి అలరించారు. ముగ్గుల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన వారిని ఎంపిక చేసి శనివారం ఓటర్ల దినోత్సవం సందర్భంగా బహుమతులు ప్రదానం చేస్తామని అధికారులు తెలిపారు.

బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి



తవణంపల్లె: మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు, అధికారులు

ఐరాల: బాలికలను చదువుతోపాటు అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని, లింగ వివక్ష వీడాలని ఎంపీడీఓ ధనలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నేడు సమాజంలో బాలికలు వివిధ రంగాల్లో తమ ప్రత్యేకతను చాటుకుంటూ ముందంజలో ఉన్నారని చెప్పారు. రక్షణ, అంతరిక్షం, సాఫ్ట్‌వేర్, విద్య, వైద్యం, క్రీడలు తదితర అనేక రంగాల్లో ప్రతిభను చాటుతున్నారని తెలిపారు. బాలికలోని తెలివితేటలను సమాజానికి ఉపయోగపడేలా చేయూతనిస్తే సమాజం సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంఈఓ రుషేంద్ర బాబు మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల బాలికలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమాజం అసమానతలను విద్యార్థినులు చదువు ద్వారానే తొలగించుకోవచ్చని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని, ముఖ్యంగా చదువులో ప్రతిభను చాటుకోవాలని తెలియజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మాట్లాతూ బాలికలు ధైర్యంగా సమస్యలు ఎదుర్కొని జీవితంలో నిలబడాలన్నారు. అనంతరం ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలు సాధికారత సాధించాలి

తవణంపల్లె: బాలికలు అన్ని రంగాల్లో సాధికారత సాధించి ముందడుగు వేయాలని ఐరాల సీడీపీఓ నిర్మల పిలుపునిచ్చారు. ప్రపంచ బాలికల దినోత్సవాన్ని తవణంపల్లె, అరగొండ హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ నిర్మల మాట్లాడుతూ బాల్య వివాహాలను చేయడం చట్టరీత్యానేరం అన్నారు. ఎంపీడీఓ రెడ్డిబాబు మాట్లాడుతూ ప్రతి బాలిక ఒక లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఏఎస్‌ఐ శాంతి మాట్లాడుతూ బాలికల చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం తవణంపల్లె, అరగొండలో మానవహారం నిర్వహించారు. విద్యార్థినులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవరాజులు రెడ్డి, మోహన్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా పోలీసులు, మహిళా ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

బాలికల భద్రతకు పెద్దపీట

గుడిపాల: బాలికల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అంగన్‌వాడీ సీడీపీవో శ్యామ్‌సుగుణకుమారి అన్నారు. బొమ్మసముద్రం హైస్కూల్‌లో శుక్రవారం బాలికా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, విద్య, భద్రతపై దృష్టి పెట్టాలని చెప్పారు. బాల్య వివాహాలు నేరమని, దీనిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. బాలికల హక్కులు, చట్టాలు, జెండర్ సమానత్వం, పోషకాహారం తదితర అంశాలను తెలియజేశారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం బాలికలతో కలిసి ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ద్రాక్షాయణి పాల్గొన్నారు.





ఐరాల: విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎంపీడీఓ ధనలక్ష్మి, గుడిపాల: బొమ్మసముద్రంలో నిర్వహిస్తున్న ర్యాలీ

క్లుప్తంగా

మురుగునీటి గుంతకు రక్షణ కంచె



బంగారుపాళెం: మండల కేంద్రంలోని పాత పోస్టాఫీస్ రోడ్డు వద్ద ప్రమాదకరంగా ఉన్న మురుగునీటి గుంత చుట్టూ శుక్రవారం పంచాయతీ అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. ఈ మురుగునీటి గుంతలో తరచూ వాహనదారులు పడిపోవడంతో ఈ నెల 18వ తేదీ సాక్షి దినపత్రికలో మురుగునీటి గుంతను పట్టించుకోరా అనే వార్త ప్రచురితమయ్యింది. వార్తకు స్పందించిన అధికారులు మురుగునీటి గుంత చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

మాంసం విక్రయాలు నిషేధం

చిత్తూరు అర్బన్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరంలో ఆదివారం మాంస విక్రయాలు నిషేధిస్తున్నట్లు మునిసిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని అన్ని మాంస విక్రయ కేంద్రాలు, చేపల విక్రయ కేంద్రాలు 26వ తేదీన ఆపేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి ఒక్క రోగికీ వైద్యసేవలు



వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: ప్రతి ఒక్క రోగికీ వైద్య సేవలను గ్రామాల్లోనే అందిస్తున్నట్లు బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. వెంగమాంబపురంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలపై ప్రత్యేకశ్రద్ధ తీసుకొని చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. వారికి అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారాన్ని అందజేసి తల్లి, బిడ్డ క్షేమంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం గర్భిణులకు ఇళ్లవద్దకు వెళ్లి వైద్యసేవలు చేశారు. బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి చికిత్సలు చేసి మందులు, మాత్రలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దివ్య, స్వర్ణ, సుమతి, రీటా, కార్తి నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో యాజమాన్యం

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగ మేళాలో అరుణాచల డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఆ కళాశాల చైర్మన్ జగన్నాథరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని మిట్టూరులో ఉన్న ఆ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో బీఎస్సీ, బీకాం, బీబీఏ విభాగాలకు చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థులు 12 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.3 లక్షలు ఉంటుందన్నారు. కళాశాలలో నిర్వహించే పోటీపరీక్షల శిక్షణ, మాక్ ఇంటర్వ్యూలు, స్పెషల్ కమ్యూనికేషన్ తరగతులు, సెమినార్లు విద్యార్థుల ఎంపికకు దోహదం చేశాయన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సునంద, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత సామాజిక బాధ్యత



మంగళపల్లెలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బంగారుపాళెం: పరిసరాల శుభ్రత సామాజిక బాధ్యత అని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యతాదినోత్సవం, బాలిక సంరక్షణ దినోత్సవం సందర్భంగా చిత్తూరు విజయం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళపల్లె ఉన్నత పాఠశాలలో శ్రమదానం చేశారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. పాఠశాలలో మొక్కలు నాటారు. పరిసరాల శుభ్రత, సాగులో రసాయన ఎరువుల వినియోగం వల్ల కలిగే చెడు ప్రభావాలు, జావన ఎరువుల ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, స్మార్ట్‌ఫోన్, సామాజిక మాధ్యమాల ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విజయం కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.